

వర్చువల్‌గా ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



వజ నం..!



- 3వేల ఎకరాల అటవీ భూమికి గ్రామస్థులే రక్షకులు
- రెండున్నర దశాబ్దాలుగా కాపాడుకుంటున్నారు
- 40శాతం శ్రీగంధం చెట్లు
- వంటచెరుకుగా వాడరు..
- వణ్యప్రాణులనూ ముట్టరు..

బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా నాలుగు చెట్లు పెరిగితే కొట్టేద్దామా..కోసేద్దామా అన్న ఆలోచన మొదలవుతోంది. కానీ ఊరు ఊరంతా ఏకమై అడవిని కాపాడుకుంటున్నారు. ప్రతి చెట్టును తమ కన్న పిల్లల్లా చూసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అటవీప్రాంతాలను ఆక్రమించుకుని వ్యవసాయ భూములుగా మార్చుకోవడం, నివాసాలు ఇతరత్రా ప్రయోజనాలకు వాడుకోవడం నిత్యం గమనిస్తుంటాం. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల భూమిని దశాబ్దాలకాలంగా వేలాదిమంది అనుభవిస్తున్నట్లు పలు నివేదికలు బట్టబయలు చేశాయి. ప్రధానంగా పశ్చిమకనుమలకు అనుబంధమైన పల్లె పట్టణ ప్రదేశాలలో ప్రజలేకాకుండా ప్రభుత్వ, అనుబంధ సంస్థలు, కార్యాలయాలు ఇతరత్రా నిర్మాణాలు చేసుకున్నారు. వాటిని తొలగించేందుకు అటవీశాఖ భారీ కసరత్తు చేస్తోంది. పశ్చిమకనుమల సంరక్షణ విషయంలో హరితవిప్లవకారుడు స్వామినాథన్ నివేదికను ప్రభుత్వం అమలుచేయకపోవడానికి కారణం కూడా వేలాది మంది ప్రజలకు వ్యతిరేకం అవుతుందనేది ప్రధాన కారణమని తెలిసిందే.

బాధ్యతగా భావిస్తారు..

అటవీప్రాంతాన్ని అభివృద్ధి చేయడం అందరి బాధ్యత అనే గ్రామస్థులంతా భావిస్తారు. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ వంటచెరుకు వాడరాదని 20ఏళ్లక్రితమే 800 ఇళ్లకు వంట గ్యాస్ సిలిండర్లను సమకూర్చుకున్నారు. ప్రస్తుతం 3వేల ఎకరాల అటవీప్రదేశంలో కనీసం 40శాతం శ్రీగంధం చెట్లు ఉన్నాయి. వీటి విలువ రూ.కోట్లలో ఉంటుంది. పలు మార్లు సమీప గ్రామస్థులు, దూరప్రాంత వాసులు శ్రీగంధం చెట్లకోసం వచ్చిన సందర్భాలు ఉన్నాయి. వారిని గ్రామస్థులంతా తిప్పి పంపారు. పర్యావరణం సుందరంగా తీరడంతో రాష్ట్ర పర్యాటకశాఖ కరడికొల్ల సిద్దేశ్వర క్షేత్రంగా బోర్డు ఏర్పాటు చేసింది. వివిధ ప్రాంతాల భక్తులు ఇక్కడికి వచ్చి పూజలు చేస్తుంటారు. అటవీప్రాంతంలో చిరుత, ఎలుగుబంట్లు, జింకలు, అడవిపందులు, నెమళ్ల పలు వన్యజీవులు ఉన్నాయి. గ్రామస్థుల అభిప్రాయం ప్రకారం రెండున్నర దశాబ్దాలపాటు అడవిని రక్షించుకోవడంతోనే ప్రస్తుతం గ్రామం ఆహ్లాదకరంగా ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో గ్రామస్థులు



సిద్దేశ్వర గ్రామ అటవీ సమితి సభ్యులు

విలువైన శ్రీ గంధం.. ఔషధ మొక్కల నెలవు

రాష్ట్రంలో పర్యావరణ వేత్తలు అటవీసంపదను కాపాడుకునేందుకు, మనుగడ సాగించేందుకు పోరాటాలు చేస్తున్నారు. బెంగళూరు హెసరఘట్ట ప్రాంతంలో వేలాది ఎకరాల భూమి ఆక్రమణలకు గురికాకుండా ఎన్నో ఉద్యమాలు సాగుతున్నాయి. అయితే ఇలాంటి కాలంలోనూ హావేరి జిల్లాలో 3వేల ఎకరాల అటవీభూమిని రక్షిస్తూ గ్రామస్థులు ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలోని చిట్టచివరి గ్రామం గుడ్డదమాదాపుర వాసులు సామూహికంగా అడవిని రక్షిస్తున్నారు. వన్యప్రాణుల వేట, చెట్ల నరికివేత ఇక్కడ పూర్తిగా నిషేధం. గ్రామస్థుల్లో ప్రతి ఒక్కరూ ఈ విధానాన్ని పాటిస్తారు. ఎవరూ అడవిలోని చెట్లు నరకడానికి వీలులేదు. ప్రతి ఒక్కరూ అడవిని రక్షించే విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారు. అడవిలోని చెట్లను కన్న పిల్లల్లా రక్షించుకుంటారు. హిరేకరూరు ఫారెస్ట్ డివిజన్ పరిధిలో సుమారు 15-20 కిలోమీటర్లలో వైవిధ్యమైన చెట్లు ఉన్నాయి. అందులో సుమారు 40శాతం శ్రీగంధం చెట్లు ఉన్నాయి. 86 రకాల ఔషధాల చెట్లు, పండ్ల చెట్లు ఉన్నాయి. ఎవరు కూడా అటవీసంపదను నాశనం చేయాలని భావించరు. రూ.కోట్ల విలువైన వృక్షాలున్నా కన్నపిల్లల్లాగే భావిస్తారు. పూచిక పుల్ల కూడా ఎవ్వరినీ తీసుకోనివ్వరు. వారు కూడా దుర్వినియోగం చేయరు.

పోరాటం వెనుక చరిత్ర

గుడ్డదమాదాపుర గ్రామస్తులు సామూహికంగా భూమిని రక్షించుకునేందుకు పోరాటం చేశారు. రామకృష్ణహెగ్డే ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరిహరలోని బిర్లా కంపెనీకి దారి తీసేందుకు ముడి సామగ్రికి అవసరంగా రాష్ట్రమంతటా వనమహోత్సవం పేరిట నీలగిరి చెట్లు పెంచేందుకు మొక్కలు పంపిణీ చేశారు. 75వేల ఎకరాల అటవీభూముల్లో నీలగిరి చెట్లు పెంచేందుకు ప్రభుత్వం ఆదేశించింది. లీజు రూపంలోనూ ఇచ్చారు. అందులో మాదాపుర పరిధిలోని కరిడికొల్ల ప్రాంతం కూడా ఒకటి. నీలగిరి మొక్కలు నాటితే నీరు, పర్యావరణానికి నష్టమని పర్యావరణవేత్త ఎస్ఆర్ హిరేమత్ నేతృత్వంలో పర్యావరణ ప్రేమికులు ఖండించారు. అటవీప్రాంతంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నీలగిరి మొక్కలు నాటరాదని కరిబసప్ప కాగినెలె నేతృత్వంలో చాలాకాలంపాటు పోరాటం కొనసాగింది. ఇలా గ్రామస్థుల్లో కరిబసప్ప చైతన్యం కలిగించారు. అటవీభూమిని మనమే రక్షించుకుందామని గ్రామస్తులందరి సమక్షంలో తీర్మానించారు. ప్రతిరోజూ కొందరు చొప్పున అడవిని రక్షించేందుకు కమిటీలు వేసుకున్నారు. ఎండాకాలంలో అగ్ని రాజుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటారు. అటవీప్రాంతంలోనూ ఓ గుట్టను సిద్దేశ్వర దేవుడిగా పూజిస్తారు. అక్కడ ఓ గుహ ఉంది. ఏటా ఇక్కడ పూజలు చేస్తారు.

రవాణా సేవలే.. లక్ష్యం..!

- అందరికీ అందుబాటులో సరుకు రవాణా చార్జీలు
- మునిరాబాద్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎంపీ రాజశేఖర్
- వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రాజశేఖర్

కంప్లి, మే 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలు, పేదలకు అవసరమైన సరుకులు తక్కువ ధరకే రవాణా చేయడం రైల్వే శాఖ లక్ష్యమని ఎంపీ రాజశేఖర్ అన్నారు. అమృత భారత్ పథకం కింద కొప్పళ జిల్లాలోని పునరాభివృద్ధి చెందిన మునిరాబాద్ రైల్వేస్టేషన్‌తో పాటు దేశంలోని 103 రైల్వే స్టేషన్లు, ఇతర ప్రాజెక్టులను ప్రధాని నరేంద్రమోదీ శనివారం రాజస్థాన్‌లోని బికనీర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొప్పళ ఎంపీ రాజశేఖర్, బసవరాజు ఇత్నాల్ మాట్లాడుతూ మునిరాబాద్ రైల్వే స్టేషన్‌ను ప్రతిష్ఠాత్మకమైన అమృత్ భారత్ నిర్మాణ విధంగా అభివృద్ధి చేశారు. రూ. 18.40 కోట్లతో ఆధునికీకరించినట్లు తెలిపారు. ఏ1 సౌకర్యాలతో ఈ స్టేషన్ ప్రయాణికులకు సేవలందిస్తుందన్నారు. ఈ స్టేషన్ అత్యాధునిక మౌలిక సదుపాయాలు, సమగ్ర సౌకర్యాలను కలుపుకుని న్యూ ఇండియా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందన్నారు. బాణాపూర్ రైల్వే స్టేషన్‌కు రూ. 950 కోట్లు, గంగావతి దరోజీ జైన్ రైల్వే శాఖ సహాయమంత్రి వి సోమన్నకు రూ. వెయ్యి కోట్లు గ్రాంట్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొప్పాల్ ఎంపీ కే రాజశేఖర్, బసవరాజు ఇత్నాల్, ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రైల్వే శాఖ పేదలకు తక్కువ ధరలకు రవాణా సేవలను అందించే వ్యవస్థను కలిగివుందన్నారు. కొప్పాల్ జిల్లాలోని కొత్త రైల్వేలైన్లు ప్రజలకు వివిధ ప్రయాణ ఎంపికలను అందిస్తున్నాయి. ఈ సందర్భంగా హేమలత కొప్పళ జిల్లా పాదశ్రీ అవార్డు గ్రహీత భీమవ్వ దొడ్డబాలప్ప, శిల్లేక్యతార, హులిగి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నీలమ్మ, సిద్దప్ప, కొప్పళ సబ్ డివిజనల్ అధికారి కేప్టెన్ మహేష్, మాజీ ఎమ్మెల్యే బసవ దడే సూగూరు, హులిగెమ్మ ఆలయ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రకాష్‌రావు, హుబ్లి డివిజనల్ మేనేజర్, దక్షిణ రైల్వే జోన్, డాక్టర్ అనూప్ అల్వా, ఇతర ప్రజాప్రతినిధులు, మునిరాబాద్ రైల్వే స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మునిరాబాద్ రైల్వే స్టేషన్

చలవాదిపై దాడి గర్హనీయం

- నిందితులను అరెస్ట్ చేయాలి
- మంత్రి ప్రియాంక ఖర్గేను కేబినెట్ నుంచి తొలగించాలి : బీజేపీ



చలో కలబురగి నిరసనలో బీజేపీ నాయకులు

బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి పట్ల కాంగ్రెస్ కార్యకర్తలు, అనుచరులు దాడి చేయడం గర్హనీయమని, మంత్రి ప్రియాంక ఖర్గేను కేబినెట్ నుంచి తొలగించాలని ఆగ్రహిస్తూ శనివారం బీజేపీ నేతలు చలో కలబురగి ప్రారంభించారు. ఈనెల 21న తిరంగాయాత్రలో పాల్గొనేందుకు చలవాది నారాయణస్వామి కలబురగి జిల్లా చిత్తాపురకు వెళ్లారు. ప్రభుత్వ అతిథి గృహంలో చలవాది బస చేసి ఉండగా కాంగ్రెస్ కార్యకర్తలు ముట్టడించడం, మంత్రి ప్రియాంకఖర్గే అనుచరులు దురుసుగా ప్రవర్తించడంపై బీజేపీ నేతలు మండిపడ్డారు. కలబురగి జిల్లా అధికారి కార్యాలయం వద్ద చలో కలబురగి పేరిట బీజేపీ నేతలు నిరసన చేపట్టారు. ప్రతిపక్షనేత అశోక్, పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, నాయకుడు సీటీ రవితోపాటు గోవింద కారజోళ, సీఎన్ అశ్వత్థనారాయణ పాల్గొన్నారు. విజయేంద్ర మాట్లాడుతూ సుమారు 4 గంటలపాటు అతిథిగృహం నుంచి చలవాది నారాయణస్వామి బయటకు రాకుండా దిగ్బంధించారన్నారు. గతంలో సీఎం సిద్దరామయ్య కొడగు పర్యటనకు ప్రతిపక్షనేత హోదాలో వెళ్లినప్పుడు వాహనానికి అడ్డుకున్నారనే కారణంతో కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. అయితే ప్రతిపక్షనేత చలవాదిని గెస్ట్ హౌస్ నుంచి బయటకు రాకుండా అడ్డుకుని ఇబ్బంది కలిగించినవారిపై ఎందుకు చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు ప్రియాంక ఖర్గే సదరు చర్యలను సమర్థించడం ఎంతవరకు సముచితమన్నారు. చలవాదిని ముట్టడించేందుకు యత్నించినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

కలబురగి ఎస్పీపై హక్కుల ఉల్లంఘన ఫిర్యాదు

కలబురగి జిల్లా ఎస్పీతోపాటు ఇతర అధికారులపై చలవాది నారాయణస్వామి హక్కుల ఉల్లంఘన ఫిర్యాదు చేశారు. పరిషత్ సభాపతి బసవరాజహొరట్టిని కలసి వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించారు. అయితే సభాపతి అందుబాటులో లేకపోవడంతో కార్యదర్శికి వినతిని ఇచ్చారు. కలుబరగి ఎస్పీ ఆడూరు శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ మహేశ్ మేఘణ్ణ, డీఎస్పీ శంకరగౌడ పాటిల్, సీఐలు చంద్రశేఖర్ తిగడి, నటరాజ్ లాడాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు పరిషత్ సభాపతికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు.



పని భారం..!

- పర్యాటక శాఖలో 70 శాతం ఉద్యోగాలు ఖాళీ
- 312 పోస్టులకు 224 మంది సిబ్బందే..

బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక అంటూనే దక్షిణభారత్‌లోనే భిన్నమైనది. ఇక్కడ అన్ని విధాలా పర్యాటకులకు అనుకూలంగా ఉంది. ఆధ్యాత్మిక కేంద్రాలు కోకొల్లలుగా ఉన్నాయి. శిల్పకళా సౌందర్యాలు ప్రత్యేకం అనిపిస్తున్నాయి. సుదీర్ఘమైన తీర ప్రాంతం అనుకూలంగా ఉంది. పశ్చిమకనుమలు విస్తారంగా ఉండడంతో రిసార్టులు, సరస్సులు, ఘాట్‌లు ఉన్నాయి. ఇక కొడగు జిల్లా మడికేరి ప్రాంతం అత్యధిక వర్షంతోపాటు భిన్నమైన వాతావరణం కల్గిన ప్రాంతం. దేశ విదేశీయులు ఇక్కడ గడిపేందుకు ఆసక్తి చూపుతారు. ఎకో టూరిజం, సముద్రతీరం, ట్రెక్కింగ్‌తోపాటు అన్ని విధాలా పర్యాటకులకు రాష్ట్రం అనుకూలమైనది. హోం స్టేల విధానం దక్షిణభారత్‌లోనే ప్రత్యేకత. కొడగు జిల్లా వ్యాప్తంగా హోం స్టేలు ఉన్నాయి. కొప్పళ జిల్లా పరిధిలోనూ ఉన్నాయి. హోం స్టేలు అంటే ఇతర హోటళ్ల మాదిరిగా కాకుండా ఇంటి వాతావరణం ఉంటుంది. పర్యాటకులకు కోరుకున్న శైలి ఆహారం, ఇతరత్రా సౌలభ్యాలు కల్పిస్తారు. సమీపంలోని సందర్శనా స్థలాలకు రవాణా, తదితర సౌకర్యాలు ఉంటా యి. ఇలాంటి సౌలభ్యాల ద్వారా పర్యాటక శాఖ ఏటా ఆదాయాన్ని పెంచుకునేందుకు పలు స్కీంలు అమలు చేస్తున్నామని ఏటా ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. అయితే పర్యాటకశాఖ అభివృద్ధికి సర్కారు చేసింది శూన్యమే. రాష్ట్రంలో ఏ శాఖలో లేనివిధంగా ఏకంగా 72 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పర్యాటకశాఖకు 312 పోస్టులు మం జూరు కాగా 224 ఖాళీగా ఉన్నాయి. ఈలెక్కన 28శాతం మంది మాత్రమే ఉద్యోగులు ఉన్నారు. అభివృద్ధికి అవకాశాలు ఉన్నా సిబ్బంది కొరతతో పలు విధాలా నష్టం జరుగుతోంది.

అదనపు బాధ్యతలు

ఉన్న సిబ్బంది ఎక్కువ బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోంది. పర్యాటకశాఖలో సిబ్బందిని భర్తీ చేసి పర్యాటక కేంద్రాల్లో సౌకర్యాలు పెంచితే ఖజానాకు ఆదాయం పెరగనుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నేరుగా నియామకాల ప్రక్రియ జరుపుకొనేందుకు పర్యాటక శాఖ కసరత్తు జరుపుతోంది. ఫస్ట్‌గ్రేడ్ అసిస్టెంట్‌లు 6 పోస్టులు, సెకండ్‌గ్రేడ్ అసిస్టెంట్ 6 పోస్టులను కేపీఎస్‌సీ ద్వారా భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో ప్రస్తావనలు పంపే ప్రక్రియ సాగుతోంది. పురావస్తు శాఖలో గడిచిన మూడేళ్లలో రెండు ద్వితీయ శ్రేణి సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫస్ట్‌గ్రేడ్‌లో 8, సెకండ్ గ్రేడ్‌లో 4, అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు 3 ఖాళీగా ఉన్నాయి. ఇక గ్రూప్ సీ విభాగంలోని డేటా ఎంట్రీ ఆపరేటర్, గ్రూప్ డీ పోస్టులు కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేస్తున్నారు.

810 పర్యాటక కేంద్రాలు

రాష్ట్రవ్యాప్తంగా 810 పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. పర్యాటకశాఖ 2020-26 సంవత్సరానికి గాను టూరిజం పాలసీని తీసుకొచ్చింది. తద్వారా రాష్ట్రంలోని 810 పర్యాటక కేంద్రాలను గుర్తించింది. జిల్లాకొక కేంద్రానికి ప్రత్యేక ప్రాజెక్టు ద్వారా అమలు చేయదలిచారు. ప్రాధాన్యతకు అనుగుణంగా వివిధ శాఖలు, ప్రాజెక్టులు అభివృద్ధి చేసేలా జిల్లా అధికారులకు రాష్ట్ర పర్యాటకశాఖ సూచించింది. పర్యాటకులకు అనుకూలమయ్యేలా వెంటనే ప్రాజెక్టులు రూపొందించి సిబ్బంది కొరత పరిష్కరిస్తామని చెబుతున్నా కొన్నేళ్లకాలంగా వాయిదాలు పడుతున్నాయి. రాష్ట్రంలో కొన్ని పర్యాటక కేంద్రాలను సందర్శించేవారికి సమగ్ర సమాచారం సమకూర్చేందుకు ప్రభుత్వమే టూరిస్ట్ గైడ్‌లను నియమించదలిచింది. ఇందుకోసం 400 మంది టూరిస్ట్‌గైడ్‌లను నియమించాలని ఆలోచిస్తోంది. తద్వారా పర్యాటకులు ఏ ప్రాంతానికి వెళ్లినా అందుకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు వీలుంటుందని భావిస్తున్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసే విషయమై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని పర్యాటకశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ అభిప్రాయపడ్డారు. త్వరలో అన్నీ భర్తీ చేస్తామన్నారు.

కేటగిరి	మంజూరు	భర్తీ	ఖాళీ
గ్రూప్ ఏ	22	22	-
గ్రూప్ బి	29	24	5
గ్రూప్ సి	208	35	173
గ్రూప్ డి	53	7	46
మొత్తం	312	88	224



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.48	1,577.47
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,897	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,123	12
నీటి నిల్వ (టీఎంసీలు)	10.60	3.36

రేపు వ్యవసాయ విశ్వ విద్యాలయం
స్నాతకోత్సవం



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ హనుమంతప్ప

రాయచూరు, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం 14వ స్నాతకోత్సవాన్ని ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ హనుమంతప్ప తెలిపారు. శనివారం రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. స్నాతకోత్సవం సందర్భంగా 352 మందికి డిగ్రీలు, 136 మందికి పీజీ పట్టాలను అందజేస్తామన్నారు. వీరితో పాటు 39 మందికి డాక్టరేట్ పట్టాలను అందజేయనున్నట్లు తెలిపారు. గడచిన మూడేళ్లలో వ్యవసాయ వ్యవసాయేతర రంగంలో విశేష కృషి చేసిన రైతుకు డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ థావర్ చంద్ గెహ్లోత్, వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయ స్వామితో పాటు భారతీయ విశ్వ విద్యాలయాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకట్ మిత్తల్ రానున్నట్లు వీసీ తెలిపారు. కాగా ఈ సందర్భంగా విశ్వ విద్యాలయం సాగించిన పరిశోధనలు, సాధించిన విజయాలు, రైతులకు వ్యవసాయ విశ్వ విద్యాలయం ద్వార అందిన ప్రయోజనాలు తదితర వివరాలను సావయవలో విడుదల చేస్తామన్నారు.

కార్మికులకు ఆరోగ్య పరీక్షలు
తప్పనిసరి: వైద్యాధికారి

సిరుగుప్ప, మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పౌర కార్మికుడు నెలకొకసారి ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యా శిక్షణ అధికారి డాక్టర్ మహమ్మద్ ఖాసీమ్ తెలిపారు. శనివారం సిరుగుప్ప పట్టణంలో నగర సభ కార్యాలయంలో పౌర కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరీక్ష శిబిర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 116 మంది పౌర కార్మికులకు బీపీ, షుగర్ తదితర వ్యాధులపై పరీక్షలు చేశారు. నగరసభ పౌర కార్మికులుశానిటరీ ఇన్స్‌పెక్టర్ రంగనాథ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మహమ్మద్ ఖాసీమ్

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు జరగాల్సిందే..!

● యత్నాళ్ పార్టీలోకి తిరిగి రావాలన్నదే ఆకాంక్ష : మాజీ మంత్రి కుమార బంగారప్ప

రాయచూరు, మే 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పునకు సంబంధించి తాను పాత అభిప్రాయానికే కట్టుబడి ఉన్నానని మాజీ మంత్రి బీజేపీ నాయకుడు కుమార బంగారప్ప అన్నారు. ఈ విషయంలో పార్టీ అగ్ర నాయకత్వమే సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాల మేరకు నడుచుకోవడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అదే పద్దతిలో తాము కూడా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. బసనగౌడ పాటీల్ యత్నాళ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం పార్టీ అధిష్టానం నిర్ణయం అని అయితే ఆయన తిరిగి పార్టీలోకి రావాలన్నది తమ ఆకాంక్ష అన్నారు. కాగా రాష్ట్రంలో వలసవాదులు, శరణార్థుల సంఖ్య విచ్చల విడిగా పెరిగిపోతుందని దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయాలన్నారు. బ్రతుకుదెరువు కోసం వచ్చామని చెబుతూ తప్పుడు ధ్రువపత్రాలు, ఆధార్ కార్డును ఆధారంగా పౌరసత్వం పొందుతున్నారని ఇందులో నాయకులు, అధికారుల పాత్ర ఉందంటు మాజీ మంత్రి తీవ్ర ఆరోపణ చేశారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీల అమలు పేరుతో ఖజాన ఖాళీ చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాళ అంచుకు నెట్టిందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కుమార బంగారప్ప

బెంగళూరు రహదారి రోడ్లు పూడ్చడానికి దేవుడే దిగి రావాలంటు సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో మంత్రులు ఆర్థిక నేరగాళ్లతో జట్టు కట్టుతున్నారని, హని ట్రాప్ వ్యవహారాన్ని అర్థాంతరంగా మూసివేశారని, మంత్రుల పైన ఆరోపణలు వస్తున్నా పట్టించుకునే నాథుడే కరువైయ్యాడన్నారు. క్రమంలో పక రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీని మరింత బలోపేతం చేస్తామని త్వరలో రానున్న రాష్ట్ర నూతన అధ్యక్షుడి నేతృత్వంలో పార్టీ బలోపేతానికి తామంతా నిబద్ధతతో పని చేస్తామన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

● దిశా సమితి సభ్యులు డాక్టర్ దానప్ప



ఛానాళ్ గ్రామంలో కూలీలతో మాట్లాడుతున్న ఏసీ దానప్ప

కంప్లి, మే 24(ఆంధ్రజ్యోతి): వేసవిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పనుల కింద వంద రోజులు పనులు కల్పిస్తున్నామని, వాటిని సద్వినియోగపరచుకుని గ్రామంలోనే జీవితం గడపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిశా సమితి సభ్యులు డాక్టర్ దానప్ప సూచించారు. శనివారం కంప్లి నియోజకవర్గంలోని ఛానాల్ గ్రామ ప్రజలు ఫిర్యాదు మేరకు ఛానాల్ చేరుకుని పలు అంశాలపై గ్రామ ప్రజలతో చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా దానప్ప మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామంలోని ప్రజలకు ఇచ్చే సదుపాయాలను పథకాలను సక్రమంగా అందేలా చూడాలని గ్రామ పంచాయతీ అధికారులకు అలాగే గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్కరికి వంద రోజుల పనులు కల్పించి వారు ఆ గ్రామం నుండి వలసలు వెళ్లకుండా చూడాలని కోరారు. గ్రామ పంచాయతీలో వుండే అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వారిపైన తమ పై నుండి అధికారులకు ఫిర్యాదు చేసి వారిపైన వేటు వేస్తామని హెచ్చరించారు.



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

సిరుగుప్ప, మే 24(ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌లో విజయం సాధించిన సైనికుల ధైర్య సాహసాలు మరువలేమని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప అన్నారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగా యాత్ర ర్యాలీని ఆయన ప్రారంభించారు. సిరుగుప్ప పట్టణంలో హైస్కూలు మైదానం నుంచి టిప్పుసుల్తాన్ సర్కిల్ వరకు తిరంగ యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమలింగప్ప మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ పాకిస్తాన్ కుట్రలను అంతం చేయడంలో ఎనలేని కృషి చేశారన్నారు. కేంద్రమంతుల్రు రాజనాథ్‌సింగ్, అమిత్‌షాలు ఈ పోరాటానికి ఎంతో కృషి చేయడంతో భారత్‌ను తాకాలంటే ఇతర దేశాలకు కూడా వణుకుపుడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు అనిల్ నాయుడు, ఎస్టీ మోర్చ అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప, తాలుకా అధ్యక్షులు మల్లికార్జున స్వామి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ జూన్‌లోగా ప్రారంభించాలి

● మాజీ మంత్రి ఆంజనేయ

రాయచూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి ఎచ్ ఆంజనేయ డిమాండ్ చేశారు. ఈ విషయంలో న్యాయమూర్తి నాగమోహన్ దాస్ నేతృత్వంలో కమిటీ ఇప్పటికే తన కార్యచరణ ప్రారంభించిన నేపధ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. కాగా లింగాయత్, జంగములు ధ్రువీకరణ పత్రం ఆధారంగా తమ కులాన్ని నమోదు చేయించాలనే నిబంధనను సడలించాలన్నారు. అదే సమయంలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను పొందడాన్ని అనుమతించకూడదన్నారు. ఎస్సీ కులగణన కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసి వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కాగా తాను సీఎం సిద్ధరామయ్యను రెండవ అంబేడ్కర్‌గా పేర్కొనడాన్ని మరోసారి మాజీ మంత్రి సమర్థించుకున్నారు. దేశంలోనే తొలి సారిగా ఎస్‌ఈపీ, టీఎస్‌పీ చట్టాలను రూపొందించి 40 కోట్ల రూపాయిలను ఎస్సీల సంక్షేమానికి కేటాయించారన్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య ఎస్సీల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆంజనేయ

సమస్యే పరిశోధనకు బీజం

● 'ఇండియా' అధ్యక్షుడు ఎంఎస్ శశిధర్



సెమినార్‌లో పాల్గొన్న వివిధ ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధులు

బళ్లారి గాంధీనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): సమస్య అనేది పరిశోధనకు ప్రధాన బీజం లాంటిదని, ప్రతి సమస్య నూతన ఆవిష్కరణలకు దారి తీస్తుందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్(ఇండియా), మునిరాబాద్ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం. శశిధర్ అభిప్రాయ పడ్డారు. స్థానిక రావ్ బహదూర్ వై. మహాబళేశ్వరప్ప ఇంజనీరింగ్ కళాశాల(ఆర్‌వైఎస్‌సీ) మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా), మునిరాబాద్ కేంద్రం సహకారంతో శనివారం ఏర్పాటు చేసిన మూడు రోజుల పరిశోధనా విభాగాల గురించి ఏర్పాటు చేసిన సెమినార్‌కు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిసర మాలిన్యంతో పాటు సమస్యలకు ఎలక్ట్రిక్ వాహనాల పరిశోధనకు కారణమయ్యాయని, దివ్యాంగులు నడవడానికి ఇబ్బందులను పరిష్కరించేందుకు వీల్ ఛైర్ ఆవిష్కారానికి కారణమైందన్నారు. సృష్టిలో ప్రతి ఒక ఆవిష్కారానికి సమస్య ద్వారానే పుడుతుందన్నారు. పరిశోధన అంటే సమస్యలకు విజ్ఞానం ద్వారా కనుక్కోవడం కళగా నిలిచిందన్నారు. పరిశోధన అనే మనోభావం లేని ఇంజినీయర్ ఇంజిన్ లేని వాహనం లాంటిదని శశిధర్ అభిప్రాయ పడ్డారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినయర్స్ కార్యదర్శి డాక్టర్ పి. శరత్ కుమార్ మాట్లాడుతూ, పరిశోధనకు సహాయం చేసే అనేక సంస్థలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు ప్రాజెక్టులు కేవలం సంఖ్యలుగా ఉండిపోరాదని, అవి భవిష్యలో ఆవిష్కారాలకు పునాదులుగా నిలవాలన్నారు. అనంతరం ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ సవితా సోనోళి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు యువ పరిశోధకులకు దారిదీపాలుగా నిలవాలన్నారు. పరిశోధను అవకాశాలు అన్ని చోట్ల ఉన్నాయని, అయితే వాటిని గుర్తించే రీతిలో ఆవిష్కారపరమైన దృష్టి అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన బిఎంఎస్ ఇంజనీరింగ్ కళాశాల డాక్టర్ కమ్మార కిశోర్ కుమార్, మెకానికల్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వీరభద్రప్ప, అలగూరులు మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

ఆదర్శనేత నీలం సంజీవరెడ్డి

● జయంతి వేడుకల్లో ఉపాధ్యాయ నేత రవి చెళ్లగుర్కి



నీలం సంజీవరెడ్డికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బళ్లారి సిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): ఆదర్శవంతమైన నేతగా, భారతదేశానికి రాష్ట్రపతిగా పోటీలేకుండా ఎన్నికైన వ్యక్తిగా నీలం సంజీవరెడ్డి ఖ్యాతి గడించారని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. శుక్రవారం తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మాజీ రాష్ట్రపతి సంజీవరెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంజీవరెడ్డి ఆత్మగౌరవ రాజకీయాలకు మరోపేరని, ఆయన లోక్‌సభలో ఆదర్శవంతమైన స్పీకర్‌గా పనిచేశారన్నారు. రాజకీయాలకు దూరంగా ఉన్నప్పుడు ఆయన తనకు ఇష్టమైన రంగం వ్యవసాయంలో నిమగ్నమయ్యారు. జయప్రకానారాయణ్ ప్రోద్బలంతో ఆయనక్రియాశీల రాజకీయల్లోకి ప్రవేశించి నంద్యాల లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెసేతర అభ్యర్థిగా గెలిచారు. ఆయన 1977 నుంచి 1982 వరకు దేశానికి ఆరవ అధ్యక్షుడిగా ఎన్నికై ఆదర్శప్రాయమైన పాలనను అందించారన్నారు. వారుదేశ పురోగతికి , అభివృద్ధికి వారి స్వంత ప్రత్యేకమైన సహకారాన్ని అందించారు. విద్యార్థులు ఆత్మగౌరవం,సత్యం, విధేయత అనే అక్షణాలను అలవర్చుకోవాలని సంజీవరెడ్డి ఆదర్శాలను పాటించాలన్నారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, శ్రీదేవి, నింగమ్మ, విద్యార్థులు, ప్రియాంక, శిల్ప, సన్నిది, ఆరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేసెట్ పరీక్షల్లో 'బెస్ట్' కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కోనంకి రామప్ప

బళ్లారి సిటీ/రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): కేసెట్ 2025 పరీక్షల్లో 'బెస్ట్' కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో పవన్‌కుమార్ రాష్ట్రానికి 524ర్యాంక్, కిశన్ పాటిల్ 561ర్యాంక్, సయ్యద్ మాహిర్ 1559ర్యాంక్, లిఖితా 1691ర్యాంక్, సాయి హర్షితా వేముల 3522, 5000 ర్యాంక్ లోపు 20 మంది విద్యార్థులు, 10,000 లోపు 57మంది విద్యార్థులు, 20,000 లోపు ర్యాంక్ 98 మంది విద్యార్థులు సాధించారన్నారు. విద్యార్థులను సంస్థ అధ్యక్షుడు కోనంకిరామప్ప, కోనంకి తిలక్, మన్నెం శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

గుండె ఉచిత చికిత్స శిబిరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వాణిజ్య మండలి సభ్యులు, వైద్యులు

బళ్లారి సిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి, వైద్య కళాశాల పరిశోధన సంస్థ(ఏపీఎంసీ)ప్రాంగణంలో శనివారం ఉచిత గుండె పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మాట్లాడుతూ బీడీసీసీఐ మరింత ప్రాచుర్యం పొందేలా చేయడానికి అనేక చురుకైన ప్రాజెక్టులు అమలు చేస్తామన్నారు. ఈ సంస్థ కేవలం వ్యాపారాన్నే కాకుండా ప్రజలతో గుర్తింపు పొందేందుకు ఆసక్తిగా ఉందన్నారు. బీఆర్ఐఎంఎస్ మెడికల్ సూపరింటెండెంట్ ఇందుమతి మాట్లాడుతూ బళ్లారిజిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి ప్రజలకు సేవ చేస్తోందని, బిమ్స్ కూడా ప్రజలకు సేవ చేయడానికి ఆసక్తిగా ఉందన్నారు. ప్రజలకు సేవ చేయడం పవిత్రమైన పని నిపుణులు ,అనుభవజ్ఞులైన వైద్యులు సిబ్బంది ఈసేవలో పాల్గొంటారన్నారు. బీడీసీసీఐ యొక్క సేవా స్ఫూర్తికి బీఆర్ఐఎంఎస్ ప్రతిస్పందిస్తుందన్నారు. ఈసందర్భంగా వాణిజ్య పరిశ్రమల మండలి మాజీ అధ్యక్షుడు బి. మహారుద్రగౌడ, ఉపాధ్యక్షుడు మంజునాథ్, దొడ్డనగౌడ, కోశాధికారి పాలన్న, మల్లికార్జున గౌడ, సురేశ్ బాబు, జిల్లా ఆసుపత్రి నుండి నిపుణులైన వైద్యులు , సిబ్బంది శిబిరంలో తనిఖీలు నిర్వహించారు. ఈశిబిరంలో 250 మందికి పైగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యనిర్వాహక కమిటీసభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఏపీఎంసీ వ్యాపారులు, రైతులు చురుగ్గా పాల్గొన్నారు.

హోసూరు జోన్

రహదారుల దుస్థితిపై ఆందోళన

● రోడ్డుపై మొక్కలు నాటి స్థానికుల నిరసన



రోడ్డుపై మొక్కలు నాటుతున్న అలసనత్తం గ్రామస్థులు

హోసూరు, మే 24(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరం పారిశ్రామికంగా అభివృద్ధి చెందినా అనుబంధమైన గ్రామీణ రహదారులు ఆశించిన మేరకు పురోగతికి నోచుకోలేదు. హోసూరు సమీపంలోని అలసనత్తం గ్రామానికి సరైన రోడ్లు లేవని గ్రామస్తులు నిరసన తెలిపారు. ఇక్కడ 400కుపైగా కుటుంబాలు ఉన్నాయి. అలసనత్తం నుంచి జయనగర్‌కు వెళ్లే మార్గం దుస్థితిలో ఉంది. ఈ మార్గంలో ప్రైవేట్ స్కూల్ వాహనాలు పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. అయినా రోడ్లను పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని రోడ్డు బాగు చేయాలని కోరుతూ నాట్లు వేసి నిరసన తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

హోసూరు, మే 24(ఆంధ్రజ్యోతి): కెలమంగలంలో వర్షపునీరు సజావుగా వెళ్లకుండా కారణమైన ఆక్రమణలను తొలగించాలని సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సర్వే నెంబరు 142లో ఆక్రమణకు గురి కావడం ద్వారా నీటి మరవ ప్రదేశం ఆక్రమణకు గురి అయినా పట్టించుకోలేదని ఆరోపించారు. కొన్నిచోట్ల నిర్మాణాలు జరిగాయని తొలగించాలన్నారు. వెంటనే రెవెన్యూశాఖ అధికారులు స్పందించాలని, లేక పోతే కష్టాలు తప్పవన్నారు. నిరసనలో సీపీఐ నగర కార్యదర్శి మధుకుమార్, డీఎంకే నగర కార్యదర్శి తస్తాకీర్, ఉపాధ్యక్షుడు సురేశ్, జిల్లా ప్రతినిధి జయరామన్, గంగేశ్, శ్రీనివాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో సీపీఐ కార్యకర్తలు

తడి, పొడి చెత్త వేర్వేరుగా వేయాలి

కంప్లి, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజలు తడి, పొడి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పురసభ వారిచ్చే బుట్టల్లో వేసి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని మున్సిపల్ చీఫ్ ఆఫీసర్ సురేష్ సూచించారు. శనివారం కారటగిలో 3వ వార్డులో పురసభ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దూరమవుతాయన్నారు.



అవగాహన కల్పిస్తున్న పురసభ సిబ్బంది

సింధనూరులో లారీ, బస్సు ఢీ

18 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం



ప్రమాదంలో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రాయచూరు, మే 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సింధనూరు నగరంలో శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, లారీ ఢీ కొని 18 మంది గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషయంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రాయచూరు నుంచి సింధనూరుకు వస్తున్న నాన్ స్టాప్ ఎక్స్ప్రెస్ బస్సును సింధనూరు నుంచి హైదరాబాద్‌వైపు వెళుతున్న లారీ ఒకటి ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. సింధనూరు నగరంలోని పీడబ్ల్యూడీ క్యాంప్ వద్ద జరిగిన ఈ ప్రమాదంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు గంటసేపటికి పైగా వాహన సంచారం నిలిచి పోగా పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కాగా గాయపడిన ప్రయాణికుల్లో ఒకరి గొంతుకు ఇనుప చువ్వ ఒకటి దిగగా ఆ చువ్వతోనే ఆ ప్రయాణీకుడిని సింధనూరు పబ్లిక్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు వెంటనే శస్త్రచికిత్స నిర్వహించి ఇనుప కడ్డి తొలగించడంతో ప్రాణాపాయం తప్పినట్లు తెలిసింది. సంఘటనకు సంబంధించి సింధనూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది.



గొంతుకు ఇనుప చువ్వ దిగడంతో విలవిలలాడున్న ప్రయాణికుడు

జిల్లా మహానాడుకు తరలిన తెలుగుతమ్ముళ్లు

అగళి, మే 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లాలో శనివారం జరిగిన మహానాడుకు జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమారస్వామి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. మడకశిర నియోజకవర్గం నుంచి కూడా వేలాది మంది తరలి వెళ్లారు. సత్యసాయి జిల్లా మామిళ్లకుంట క్రాస్‌వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మహానాడుకు గుడిబండ మండలం నుంచి భారీగా తరలివెళ్లారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

కరణ్ జోహార్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత కరణ్ జోహార్ 1972 మే 25న బాంబేలో జన్మించారు. దర్శకుడు, నిర్మాత, స్క్రీన్ రైటర్, కాస్ట్యూమ్ డిజైనర్, నటుడిగానే కాక బుల్లితెర పర్సనాలిటీగా రాణించారు. ప్రముఖ నిర్మాత యశ్ జోహార్ కుమారుడు. ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పతాకంపై విజయవంతమైన సినిమాలతో దర్శక, నిర్మాతగా సత్తా చాటుకున్నారు. అత్యధిక సినిమాలు బాక్సాఫీస్ హిట్‌గా నిలిచాయి. ఫిల్మ్‌ఫేర్, జీ, ఐఫా, స్క్రీన్ అండ్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ అందుకున్నారు. బుల్లితెరపై పలు కార్యక్రమాలకు హోస్ట్‌గా, న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 2020లో 'పద్మశ్రీ' అందుకున్నారు.

కార్తీ (పుట్టినరోజు)



ప్రముఖ తమిళనటుడు కార్తీ 1977 మే 25న మద్రాస్‌లో జన్మించారు. అసలు పేరు కార్తీక్ శివకుమార్. ప్రముఖ నటుడు శివకుమార్ చిన్న కుమారుడు, సూర్యకు సోదరుడు. మణిరత్నం దగ్గర అసిస్టెంట్ దర్శకుడిగా పనిచేసిన కార్తీ 2007లో పరుత్తివీరన్ సినిమాద్వారా పరిచయమయ్యారు. తమిళంలో నటించిన సినిమాలు తెలుగులోకి డబ్ అయిన సినిమాలకు తానే సొంతంగా డబ్బింగ్ చెప్పుకొనేవాడు. టాలీవుడ్‌లోనూ పేరొందారు. 3 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్, ఎడిసన్ అవార్డ్స్, సైమా అవార్డ్, తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డ్ ఇతరత్రా పురస్కారాలు అందుకున్నారు. అంతేకాక తమిళనాడులో ప్రముఖమైన నడిగర్ సంఘానికి 2015 నుంచి కోశాధికారిగా ఉన్నారు. సమాజసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం



మంటల్లో కాలిపోతున్న వాహనం

లేపాక్షి, మే 24(ఆంధ్రజ్యోతి): చోళసముద్రం సమీపంలో జాతీయరహదారిపై శనివారం ద్విచక్రవాహనం దగ్ధమైంది. గ్రామస్థులు తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి చెందిన రామక్రిష్ణ హిందూపురం నుంచి ద్విచక్రవాహనంలో బాగేపల్లికి వెళుతున్నాడు. చోళసముద్రం వద్దకు రాగానే ద్విచక్రవాహనానికి ఉన్న సైడ్‌బ్యాగ్‌లోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వాహనదారుడు వాహనాన్ని వదిలేసి పక్కకు దూకి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బ్యాగులో అదనంగా పెట్రోల్‌గాని ఏదైనా ఉన్నాయా, లేదా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కేఎస్ ఆర్టీసీ బస్సు.. బొలెరో ఢీ

పావగడ, మే 24(ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్టీసీ బస్సు బొలెరోను ఢీకొన్న ఘటనలో బస్సు బోల్తాపడి డ్రైవర్, రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం రాత్రి కుందుర్పి మండలం బెస్తరపల్లి గ్రామానికి రామాంజనేయులు మామిడికాయలను బొలేరో వాహనంలో కోలారుకు తరలిస్తుండగా చళ్లకెరె క్రాస్ వద్ద కేఎస్ఆర్టీసీ బస్సు బొలెరో వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో బొలెరో డ్రైవర్ రామాంజనేయులు, మరో రైతు తీవ్రంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఉపాధి హామీ పథకంపై జాగృతి

శిడ్లఘట్ట, మే 24(ఆంధ్రజ్యోతి): నరేగా పథకంలో భాగంగా నిర్మాణ పనుల స్థలంలో తాలూ వ్యాప్తంగా 'శ్రమిద్దాం రా' అనే నినాదంతో అవ గాహన కార్యక్రమం చేపట్టారు. తాలూకాలోని దొడ్డతేకహళ్ళిలో నరేగా పథకంలో భాగంగా కాళప్పనకుంటె నుంచి దిగవకుంటె వరకు కాలువ అభి వృద్ధి నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ 'శ్రమిద్దాం రా' పేరుతో ప్రత్యేక కార్య క్రమం నిర్వహించారు. దీని మూల ఉద్దేశ్యం మహిళలను కూడా భాగ స్వామ్యం చేయడం. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలకు పనులలో మిన హాయింపు గురించి తెలియచేశారు. ప్రస్తుతం నరేగా పథకం కింద రోజువారీ కూలి మొత్తం రూ.370గా ఉందన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్క అర్హుడైనవారికి వ్యక్తిగతంగాను, సము దాయంగాను పనులు పొందవచ్చునన్నారు. ఒక జాబ్‌కార్డ్‌కు సుమారు 5లక్షల రూపాయలవరకు పనులు కేటాయింపు, సద్వినియోగం చేసుకోవా లన్నారు. నరేగా హెల్ప్‌లైన్ 8277506000 గా తెలిపారు. కార్యక్రమంలో పం చాయతీ అభివృద్ధి అధికారి వజ్రేశ్‌కుమార్, తాలూకా నరేగా కన్వీనర్ లోకేశ్, డీఈఓ సుధాకర్, బీఎఫ్‌టీ మునేశ్, జీకేఎం లక్ష్మీనరసమ్మ, కూలి కార్మికులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దొడ్డతేకహళ్ళిలో జాగృతి కార్యక్రమం

ఉద్భవ శివలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

» 27న బ్రహ్మరథోత్సవం

ముళబాగిలు, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివకేశవనగర్‌లోని పురాణ ప్రసిద్ధమైన ఉద్భవ శివలింగేశ్వరస్వామి ఆలయంలో 17వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 25 నుంచి 28వరకు విశేషపూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు అంకురార్పణ, 9.30గంటలకు ధ్వజారోహణ, సాయంత్రం 6 గంటలకు ప్రాకారోత్సవం జరగనున్నాయి. 26న ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవం, అన్నసంతర్పణ జరగనుంది. 27న ఉదయం 11.30 గంటలకు బ్రహ్మ రథోత్సవం జరగనుంది. ముళబాగిలు ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్, కోలారు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎంపీ మల్లేశ్‌బాబు, డీసీపీ దేవరాజ్, కాంగ్రెస్ నాయకుడు వీ ఆదినారాయణ, తహసీల్దార్ వీ గీతా, తాలూకా పంచాయతీ ఈఓ డాక్టర్ సర్వేశ్, నగరసభ కమిషనర్ వీ శ్రీధర్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొననున్నారు. 28న ఉదయం వసంతోత్సవం, రాత్రి 8 గంటలకు శయనోత్సవం ఉంటాయి. అర్చకులు అనంత శాస్త్రి, సత్యనారాయణశాస్త్రిల నేతృత్వంలో పూజా కైంకర్యాలు ఉంటాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఉద్భవ శివలింగేశ్వరస్వామి

మండలి బుద్ధప్రసాద్‌కు ఆత్మీయ సన్మానం



మండలి బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

బెంగళూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష అధికారసంఘం అధ్యక్షుడితోపాటు మంత్రిగా డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగిన మండలి బుద్ధప్రసాద్‌ను ప్రత్యేకంగా సన్మానం చేశారు. బెంగళూరు పర్యటనకు వచ్చిన ఆయనను శనివారం తెలుగు విజ్ఞాన సమితి ప్రాంగణంలో సత్కరించారు. 1976లో ఏపీ విద్యాసాంస్కృతిక మంత్రిగా వ్యవహరించిన మండలి వెంకటకృష్ణారావుతో కలసి బుద్ధప్రసాద్ తెలుగు విజ్ఞానసమితి ప్రాంగణంలో పాఠశాల భవనాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షులు కే ఆదికేశవులు నాయుడు, సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణోత్సవ ఘట్టానికి తెలుగు విజ్ఞానసమితి పాఠశాల చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు భాషా సంస్కృతులు దేశవిదేశాలలో కొనసాగడం సంతోషకరమన్నారు. తెలుగులో చదివితే భవిష్యత్తు ఉండదనే భావన సరికాదన్నారు. జాతీయస్థాయిలో తెలుగు భాష ఒకప్పుడు రెండో స్థానంలో ఉండేదని, ప్రస్తుతం నాల్గోస్థానానికి తగ్గిపోవడం విచారకరమన్నారు. తెలుగుభాషను పశ్చిమబెంగాల్ రాష్ట్రప్రభుత్వం రెండో అధికారిక భాషగా గుర్తించడం సంతోషకరమన్నారు. కర్ణాటకకు వచ్చిన ప్రతిసారి తెలుగు వైభవం చూసినట్టు ఉంటుందన్నారు.

వీరమరణం ఇతరులకు స్ఫూర్తి కావాలి

బాగేపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): సైనికులు విధినిర్వహణలో అమరులై జన్మభూమి రుణం తీర్చుకోవడం ద్వారా జీవితాన్ని సార్థకం చేసుకున్నారని, వారి దేశభక్తి, వీరమరణం ఇతరులకు స్ఫూర్తి కావాలని అటువంటి వారికి నివాళులు అర్పించడం మన కర్తవ్యమని కసాప తాజా మాజీ అధ్యక్షుడు సుధాకర్ అభిప్రాయపడ్డారు. అఖిలభారత సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో వీరయోధులకు నివాళులు అర్పించారు. వీరయోధులకు పుష్పాంజలి చేయడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశాన్ని కాపాడే సైనికులు తమ ఆశలు ఆకాంక్షలకోసం కాకుండా దేశభక్తిగా విధులు నిర్వహిస్తారన్నారు. ఉపాధ్యాయుడు, కసాప కార్యదర్శి అయిన బానాలపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచానికి యుద్ధం అవసరం లేదని, అయితే కొన్ని విషయాలలో ఉగ్రవాదులను అంతమొందించడానికి ధర్మాన్ని రక్షించడానికి యుద్ధం అనివార్యమన్నారు. గోపినాయక వీరగీతతో ప్రారంభించి పలు కవితలు వినిపించారు. కార్యక్రమానికి రాజేశ్వరి, సుకన్యా, జ్యోతి, రామకృష్ణరెడ్డి, వలిబాష, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వీరయోధులకు నివాళులు

మేలూరులో మహిళా గ్రామసభ



మహిళా గ్రామసభలో శశికళ రమేశ్ తదితరులు

శిడ్లఘట్ట, మే 24 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మేలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శశికళ రమేశ్ అధ్యక్షతన మహిళా గ్రామసభ నిర్వహించారు. వ్యవసాయశాఖ తాలూకా సహాయక డైరెక్టర్ పీఆర్ రవి మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు 50శాతం సహాయధనం, ఎస్సీ రైతులకు 75శాతం రాయితీతో విత్తనగింజలను రైతు కేంద్రాలద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అభివృద్ధి అధికారి కేవీ శారద మాట్లాడుతూ ప్రభుత్వ సౌలభ్యాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నరేగా పథకం సహా మహిళా సమాఖ్యలో జాగృతి పెరగాలన్నారు. పంచాయతీ పరిధిలో సమాఖ్య సంఘాల ద్వారా చెత్త సేకరణ, సంస్కరణ సహా ఇతర అన్ని పనులను మహిళలకు కేటాయించడంలో ప్రాధాన్యత ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఎంజీ శ్రీనివాస్, రవిప్రకాశ్, సవితా, వనితా, రేణుకా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బైరతి సురేశ్‌కు మాతృవియోగం



నివాళులు అర్పిస్తున్న సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్‌కు మాతృవియోగం జరిగింది. మంత్రి తల్లి సుశీలమ్మ శని వారం బెంగళూరులో కన్నుమూశారు. కొన్నిరోజులుగా ఆమె వయోసహజ సమస్యలతో బాధపడుతుండేవారు. సుశీలమ్మ పార్థివదేహాన్ని సీఎం సిద్ధరామయ్య సందర్శించి నివాళులు అర్పించారు. పలువురు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు కడచూపుకోసం వచ్చారు. సీఎం మైసూరు పర్యటనను రద్దు చేసుకున్నారు. సాయంత్రం బైరతి గ్రామంలోని తోటలో అంత్యక్రియలు జరిపారు.

కమ్ముకున్న మేఘాలు...



తుమకూరు రోడ్డు ఫ్లై ఓవర్‌పై

నైరుతి రుతుపవనాలకు ముందే నగరం మేఘావృతమైంది. మరో రెండు మూడు రోజుల్లో రాష్ట్రంలో వర్షాలు ప్రవేశిస్తాయని హెచ్చరిస్తున్నారు. అంతకంటే ముందే నగరంలో మేఘావృతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలు ఫ్లై ఓవర్‌లపై వెళ్తున్నవారికి మేఘాలు కనువిందు చేశాయి. **(బెంగళూరు, ఆంధ్రజ్యోతి)**

బ్లడ్‌కేన్సర్ రోగుల సంఖ్య రెట్టింపు

బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): దేశంలో బ్లడ్‌కేన్సర్ రోగుల సంఖ్య 1నుంచి 2శాతానికి రెట్టింపు అయ్యిందని ఇది భవిష్యత్తులో తీవ్ర పరిణామం చూపనుందని నారాయణ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ మజుందార్‌షా మెడికల్ సెంటర్ చీఫ్ ఆఫ్ హెమటాలజీ శరత్ దామోదర్ అభిప్రాయపడ్డారు. ఆట్ వి హెల్త్‌కేర్ క్యాన్సర్‌పై ప్రత్యేక చర్చాగోష్టి జరి గింది. ఈ సందర్భంగా శరత్ దామోదర్ మాట్లాడుతూ అక్యూట్ మైలా యిడ్ లుకేమియా (ఏఎంఎల్) అరుదైన వేగవంతంగా ప్రబలే రక్తక్యాన్సర్ అన్నారు. సకాలంలో పరీక్షలు జరిపించుకుంటే నయం చేయవచ్చునన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునికమైన ల్యాబ్‌లు అవసరమన్నారు. దేశంలో ఏఎంఎల్‌పై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

ఐఐహెచ్‌ఎంలో ఏఐ ఆధారిత నమస్తే

బెంగళూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజిమెంట్ (ఐఐహెచ్‌ఎం) మేడ్ ఇన్ ఇండియా ఆశయంతో హాస్పిటాలిటీ జీపీటీకి నమస్తేగా నిర్ధారించారు. డొమైన్ పరిశోధనలపై రూపొందించిన ఏఐ ఆధారిత సాంకేతిక విధానమని ఐఐహెచ్‌ఎం చైర్మన్ డాక్టర్ సుబోర్నొ బోస్ తెలిపారు. గ్లోబల్ క్యాంపస్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబోర్నొ బోస్ మాట్లాడుతూ టెక్నాలజీతో రూపొందించామన్నారు. ఆతిథ్యరంగంలో కొత్తయుగం ప్రారంభమైందని హోటళ్లు, ప్రయాణీకులకోసం ఏఐ ఆధారిత వ్యవస్థను తీసుకొచ్చామన్నారు. ఇది కేవలం సాంకేతికత అద్భుతం కాదని, కొత్త ఆలోచనలు కలిగి ఉందన్నారు.

కాల్వలో జారి పడి కాంట్రాక్ట్ లెక్చరర్ మృతి



శంకరరెడ్డి (ఫైల్)

చింతామణి, మే 24(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బట్లహళ్ళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగిమాళు గ్రామానికి చెందిన కాంట్రాక్ట్ లెక్చరర్ శంకరరెడ్డి (38) గ్రామశివారులోని వ్యవసాయకుంటలో కాలు జారిపడి మృత్యువాత చెందారు. బాగేపల్లి పట్టణంలోని నేషనల్ కళాశాలలో కొన్నేళ్లుగా కాంట్రాక్టర్ లెక్చరర్‌గా సేవలందిస్తున్నారు. ఇటీవలే ఆయనకు వివాహం నిశ్చయమైంది. అకస్మిక మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

తిరుమలకు పాదయాత్ర

బళ్లారిరూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): తోరణగల్లు నుంచి తిరుమలకు భక్తులు పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. తోరణగల్లు శ్రీనివాస్ నేతృత్వంలో వరుసగా 14వ సంవత్సరం తరలి వెళ్తున్నట్లు భక్తులు తెలిపారు. తోరణగల్లు, ఎర్రంగిళి తదితర పలు గ్రామాల నుంచి దాదాపు 40 మందికి పైగా బయల్దేరి వెళ్లారు. మల్లికార్జునరెడ్డి, ఎంపీ రవీంద్ర, ఎర్రంగళి సిద్దప్ప, రాఘవేంద్ర భక్తులు ఇందులో ఉన్నారు.



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

సీఈటీ ఫలితాల్లో భవేశ్‌జయంతి టాపర్



ఫలితాలు ప్రకటిస్తున్న మంత్రి సుధాకర్

బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యాకోర్సుల ప్రవేశానికై ప్రభుత్వం నిర్వహించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీఈటీ) పరీక్షల్లో మారతహళ్ళి చైతన్యటెక్నోస్కూల్ విద్యార్థి భవేశ్‌జయంతి టాపర్‌గా నిలిచినట్లు ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్ తెలిపారు. శనివారం కర్ణాటక పరీక్షా ప్రాధికారలో ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది 3.30లక్షలమంది దరఖాస్తు చేసుకోగా 3.11లక్షలమంది పరీక్ష రాశారన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో భవేశ్‌జయంతి, అగ్రికల్చర్ విభాగంలో మూడబిదరె ఆళ్వాస్ కళాశాల విద్యార్థి అక్షయ్ ఎం హెగ్డే, నర్సింగ్ విభాగంలో యలహంక నారాయణ ఈ-టెక్నో విద్యార్థి హరీశ్ రాజ్ డీవీ, ఫార్మాడీలో హెచ్ఎస్ఆర్ లే అవుట్ నేషనల్ పబ్లిక్‌స్కూల్ ఆత్రేయ టాపర్‌గా నిలిచారు. ఇంజనీరింగ్‌లో సాత్విక్ బిరాదార్ రెండోస్థానంలోనూ, దినేశ్ అరుణాచలం మూడోస్థానంలో నిలవగా, అగ్రికల్చర్‌లో మంగళూరు ఎక్స్‌పర్ట్ కళాశాల విద్యార్థులు శశిపండిట్, సుచిత్ పి ప్రసాద్‌లు తర్వాతస్థానాలు దక్కించుకున్నారు. పశుసంవర్ధక విభాగంలో ఆత్రేయ, సఫల్‌శెట్టి 2, 3ర్యాంకులు సాధించినట్లు మంత్రి తెలిపారు. పరీక్షల్లో అక్రమాలు జరగకుండా ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీతో పాటు వెస్‌కాస్ట్ ద్వారా పర్యవేక్షించామన్నారు. ఫిజిక్స్‌కు 1 గ్రేస్ మార్క్, కెమిస్ట్రీకి 2, బయాలజీకి 1 గ్రేస్‌మార్క్‌లు వేశామన్నారు. విద్యార్థులు పోటీ పడి పరీక్షలు రాశారన్నారు. త్వరలోనే కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులు వృత్తి విద్యలో రాణించి ఉత్తమ ఉపాధి అవకాశాలు పొందాలన్నారు.

ఆకట్టుకున్న అవతార సంకల్పం



విద్యార్థుల నృత్యం



అవతార సంకల్పం నాటికలోని ఓ సన్నివేశం

పుట్టపర్తి, మే 24(ఆంధ్రజ్యోతి): ఒడిశా భక్తులు చేపట్టిన సంగీతసాంస్కృతిక కార్యక్రమాలు సత్యసాయి భక్తులను అలరించాయి. పర్తియాత్ర పేరుతో ఒడిశా రాష్ట్రానికి చెందిన 3500 మంది భక్తులు శనివా రం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయికుల్వంతు సభా మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అవతార సంకల్పం పేరిట చేపట్టిన నాటిక భక్తులను ఆకట్టుకుంది. గంటపాటు సంగీత గానంతో భక్తులను మైమరపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అల్ట్రాసౌండ్ సెంటర్లు, నర్సింగ్ హోమ్‌లలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. లింగనిర్ధారణ నిషేధ చట్టం అమలుపై శనివారం కలెక్టరేట్‌లో హిందూపురం అదనపు కోర్టు న్యాయాధికారి కె. శైలజతో కలిసి జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భస్థ శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉందన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య, శిశుసంక్షేమ శాఖ, మెప్మా, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ శాఖలతోపాటు స్వచ్ఛంద సేవా సంస్థల సమన్వయంతో లింగనిర్ధారణపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హిందూపురం అదనపు కోర్టు న్యాయాధికారి కె. శైలజ మాట్లాడుతూ.. జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ కేంద్రాలపై దాడులు చేసి, చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా సరిహద్దున కర్ణాటక రాష్ట్రం ఉండడంతో అక్కడ కూడా లింగనిర్ధారణ పరీక్షలు జరిగే అవకాశముందని, దీనిపై గట్టినిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్